# కార్లకు తగ్గిన గిరాకీ

- దేశవ్యాప్తంగా డీలర్ల వద్ద అమ్ముడుపోని 7 లక్షల ప్యాసింజర్ వెహికిల్స్
- విలువ రూ.73,000 కోట్లు.. వెల్లడించిన ఫాడా
- వాహన ఉత్పత్తికి విరామం దిశగా ఆటో రంగ సంస్థలు



న్యూఢిల్లీ, ఆగస్టు 21: కార్లకు ఆదరణ తగ్గింది. ఆశించిన స్థాయిలో అమ్ముడుపోవడం లేదు. దేశవ్యాప్తంగా డీలర్ల వద్ద మిగిలిపోయిన ప్యాసింజర్ వెహికిల్స్ (పీవీ) సంఖ్య 7 లక్షలకు చేరింది. వీటి విలువ రూ.73,000 కోట్లుగా ఉందని ఆటోమొబైల్ డీలర్ల సంఘం సమాఖ్య (ఫాడా) తాజాగా వెల్లడించింది. గత 70-75 రోజులుగా వాహనాలు డీలర్ల వద్ద అలాగే ఉంటున్న పరిస్థితి నెలకొన్నట్టు స్పష్టం చేసింది.

### ఇలాగైతే కష్టమే

డీలర్ల వద్ద పేరుకుపోతున్న వాహన నిల్వలు.. యావత్తు భారతీయ ఆటో రంగ పరిశ్రమనే సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం ఉందని ఫాడా అధ్యక్షుడు మనీష్ రాజ్ సింఘానియా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ప్యాసింజర్ వెహికిల్స్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ (పీవీ ఓఈఎం)ను డీలర్ల వైఫల్యంపై దృష్టి సారించాలని కోరారు. క్షేత్రస్థాయి పరిస్థితులను గమనించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. నిజానికి గత నెల జూలైలో దేశీయంగా పీవీ సేల్స్ నిరుడుతో పోల్చితే 10 శాతం పెరిగాయి. 3,20,129 యూనిట్లకు చేరాయని ఫాడానే చెప్తున్నది. అయినప్పటికీ కంపెనీల నుంచి డీలర్లకు వాహనాల సరఫరా పెరగడంతో గోడౌన్లలోనే ఉండిపోక తప్పడం లేదు. ఫలితంగా డీలర్లకు నష్టాలు మరింతగా పెరుగుతున్నాయి.

### ఆఫర్లు తేవాలి..

మార్కెట్‌లో మందగించిన అమ్మకాలను మళ్లీ పరుగులు పెట్టించేందుకు ఆయా సంస్థలు తమ కార్లపై ఆఫర్లు ప్రకటించాలని ఫాడా సూచిస్తున్నది. ధరలను తగ్గించడం, వారంటీలను పెంచడం, ఫ్రీ సర్వీస్ గడువును పెంచి ఇతర ప్రోత్సాహకాలను కొనుగోలుదారులకు ఇవ్వడం కలిసొస్తుందని డీలర్లు అభిప్రాయపడుతున్నారు. రాబోయే పండుగ సీజన్ దృష్ట్యా డిస్కౌంట్లు మార్కెట్‌ను ఉత్సాహపర్చగలవని కూడా చెప్తున్నారు. ఇక ఈ క్లిష్ట పరిస్థితుల్లో డీలర్లపై ఒత్తిడిని తగ్గించేందుకు తయారీదారులు ప్రొడక్షన్ హాలిడే తీసుకోవడం కూడా మంచిదేనన్న సలహాలు డీలర్ల నుంచి వస్తున్నాయి. కరోనా సమయంలో ఎదురైన విపత్కర పరిస్థితులను ఉత్పత్తి విరామంతోనే అటు కంపెనీలు, ఇటు డీలర్లు అధిగమించారు.



కార్ల తయారీ సంస్థలు మార్కెట్‌లో రిటైల్ అమ్మకాలకు తగ్గట్టుగా తమ ఉత్పత్తిని సవరించుకోవాల్సిన అవసరం ఉన్నది. రాబోయే నెలల్లో డీలర్లకు వాహనాల సరఫరాను తగ్గిస్తేనే మంచిదన్నట్టుగా పరిస్థితులు నెలకొన్నాయి. సేల్స్ పెరిగేందుకు కంపెనీలు కృషి చేయాలి. అప్పుడే డీలర్ల వద్ద మిగిలిపోయిన వాహనాలు త్వరత్వరగా విక్రయించడానికి వీలుంటుంది.

-మనీష్ రాజ్ సింఘానియా, ఫాడా అధ్యక్షుడు

## డెకథ్లాన్ 933 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ, ఆగస్టు 21: స్పోర్ట్స్ పరికరాల సంస్థ డెకథ్లాన్..భారత్‌లో తన వ్యాపారాన్ని విస్తరించడానికి వచ్చే ఐదేండ్లలో 100 మిలియన్ల యూరోలు(రూ.933 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది. రిటైల్ అవుట్‌లెట్ల సంఖ్యను పెంచుకోవడంతోపాటు ప్లాంట్ సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఈ నిధులను వినియోగించనున్నట్టు డెకథ్లాన్ ఇండియా సీఈవో శంకర్ ఛటర్జీ తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 90 స్టోర్లు ఉండగా, వచ్చే ఐదేండ్లలో వీటిని 190కి పెంచుకోనున్నట్టు ఆయన చెప్పారు. ఇక నుంచి ప్రతి యేటా 10-15 కొత్త స్టోర్లను ప్రారంభించనున్నట్టు ప్రకటించారు.

## ఐసీఐసీఐ లాంబార్డ్ ఎలివేట్

హైదరాబాద్, ఆగస్టు 21: ఐసీఐసీఐ లాంబార్డ్..ఆరోగ్య బీమా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే ఎలివేట్ పాలసీని అందుబాటులోకి తీసుకొచ్చింది. అత్యాధునిక ఫీచర్లతో రూపొందించిన ఈ బీమా పాలసీలో యాడ్-ఆన్‌లతో లోడ్ చేసుకోవచ్చునని తెలిపింది. ఊహించని వైద్య అత్యవసర పరిస్థితుల అవసరాలను తీర్చడానికి ఈ పాలసీని రూపొందించినట్లు కంపెనీ హెడ్ వివేక్ శ్రీవాత్సవ తెలిపారు. పరిమిత కవరేజ్‌తో పాలసీదారులకు నిరంతర కవరేజ్ ఇవ్వనున్నదని, యాడ్-ఆన్ అస్తమా, డయాబెటిస్, హైపర్‌టెన్షన్, ఊబకాయ వంటి వ్యాధులు ఉన్నవారు 30 రోజుల తర్వాత పాలసీ ప్రయోజనం పొందవచ్చునన్నారు.

## అమూల్ అదుర్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 21: పాల ఉత్పత్తుల విక్రయ సంస్థ అమూల్ అదరగొట్టింది. ప్రపంచ వ్యాప్తంగావున్న ఫుడ్ బ్రాండ్లలో అత్యంత బలమైన బ్రాండ్‌గా అమూల్ నిలిచింది. ఈ విషయాన్ని ఫుడ్ అండ్ డ్రింక్ 2024 పేరుతో బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రపంచ పాల ఉత్పత్తుల బ్రాండ్లలో ఇప్పటికే తొలి స్థానంలో కొనసాగుతున్న అమూల్.. తాజాగా ఫుడ్ బ్రాండ్లలో కూడా ఇదే స్థానాన్ని దక్కించుకోవడం విశేషం.

## హీరో నుంచి మరిన్ని స్కూటర్లు



న్యూఢిల్లీ, ఆగస్టు 21: ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్..స్కూటర్ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడంతోపాటు 125 సీసీ సామర్థ్యం కలిగిన మరిన్ని బైకులను విడుదల చేయడానికి సిద్ధమైంది. ఇతర పోటీ సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి మరిన్ని పెట్రోల్, ఎలక్ట్రిక్ స్కూటర్లను విడుదల చేయనున్నట్లు కంపెనీ సీఈవో నిరంజన్ గుప్తా వెల్లడించారు. అలాగే 125 సీసీ కెపాసిటీ కలిగిన ఎక్స్‌ట్రీమ్ 125ఆర్ కెపాసిటీని నెలకు 40 వేల యూనిట్లకు పెంచుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం నెలకు 25 వేల యూనిట్లు ఉత్పత్తి అవుతున్నాయి. 125 నుంచి 160 సీసీ సామర్థ్యం కలిగిన పలు మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు తెలిపారు.

## ఆభరణాల ఎగుమతులు డౌన్

### జూలై నెలలో 22 శాతం తగ్గుదల: జీజేఈపీసీ

ముంబై, ఆగస్టు 21: ఆభరణాల ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. గత నెలలో 22 శాతం తగ్గి 1,665.4 మిలియన్ డాలర్లకు పడిపోయాయని జెమ్ అండ్ జ్యూవెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) వెల్లడించింది. అంతర్జాతీయంగా ముఖ్యంగా అమెరికా, చైనా దేశాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఆభరణాలకు డిమాండ్ పడిపోవడానికి ప్రధాన కారణమని జీజేఈపీసీ చైర్మన్ విపుల్ షా తెలిపారు. అలాగే కట్, పాలిష్ డైమండ్ల ఎగుమతులు కూడా 21 శాతం తగ్గి 1,174 మిలియన్ డాలర్ల నుంచి 907.67 మిలియన్ డాలర్లకు తగ్గాయని పేర్కొన్నారు. బంగారం ఆభరణాలు కూడా 10.53 శాతం తగ్గి 603 మిలియన్ డాలర్ల నుంచి 530.38 మిలియన్ డాలర్లకు దిగాయని తెలిపింది.

# ఈ-కామర్స్ వృద్ధి ఆందోళనకరం

- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్
- తక్కువ ధరలు సరికాదు
- సంప్రదాయ రిటైల్ మార్కెట్‌ను కూలదోస్తున్నాయని మండిపాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: దేశీయ ఆన్‌లైన్ మార్కెట్‌పై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ విరుచుకుపడ్డారు. ఈ క్రమంలోనే దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఈ-కామర్స్ వృద్ధి ఆందోళనకరమైన అంశమేనని వ్యాఖ్యానించారు. ఈ-కామర్స్ సంస్థలు అవలంభిస్తున్న ధరల విధానం బాగాలేదని, సంప్రదాయ రిటైల్ రంగాన్ని అది కూలదోస్తున్నదని మండిపడ్డారు. బుధవారం ఇక్కడ 'భారత్‌లో ఉపాధి, వినియోగదారుల సంక్షేమంపై ఈ-కామర్స్ నికర ప్రభావం' నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంప్రదాయ రిటైల్ మార్కెట్‌లో ఉద్యోగ-ఉపాధి అవకాశాలను ఈ-కామర్స్ వేదికలు దెబ్బతీస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే 'ఈ దేశానికి ఈ రకమైన ధరల విధానాలు లాభం చేస్తాయా?' అని ప్రశ్నించారు. తక్కువ ధరలతో సంప్రదాయ మార్కెట్‌కు వినియోగదారులను ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలు దూరం చేస్తున్నాయని, ఇది ఇలాగే కొనసాగితే వీధుల్లో దుకాణాలు మూతబడటం ఖాయమన్నట్టుగా మాట్లాడారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌తో అంతా ఎక్కడికక్కడే షాపింగ్ చేస్తున్నారని, దీనివల్ల సమాజంలో ఒక రకమైన అంతరం కూడా వ్యాపిస్తున్నదని చెప్పారు.

### అమెజాన్‌తో ఒరిగేదేమీ లేదు

ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారత్‌లో పెడుతున్న పెట్టుబడులు ఇక్కడ దానికి వాటిల్లుతున్న నష్టాలను భర్తీ చేసుకోవడానికేనని గోయల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమెజాన్ దాని స్వలాభం కోసమే భారత్‌లో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ప్రకటించిందని, అంతేతప్ప భారత్‌కు మంచి చేద్దామని మాత్రం కాదన్నారు. ఆన్‌లైన్ మార్కెట్ పెరిగిపోతే చిరు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఇదిలావుంటే ఆన్‌లైన్ వ్యాపారులు దేశంలో 1.58 కోట్ల ఉద్యోగాల్ని సృష్టించారని ఈ రిపోర్టు తెలిపింది. ఇందులో 35 లక్షల మహిళలు కూడా ఉన్నారు. 17.6 లక్షల రిటైల్ సంస్థలు ఈ-కామర్స్ మార్కెట్‌తో భాగస్వాములయ్యాయని కూడా తేలింది. అయితే ఈ వృద్ధి దేశానికి మంచి కన్నా భవిష్యత్తులో చెడే ఎక్కువగా చేస్తుందని మంత్రి గోయల్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## కాగ్నిజెంట్ నూతన చైర్మన్‌గా రాజేశ్ వారియర్



న్యూఢిల్లీ, ఆగస్టు 21: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన కాగ్నిజెంట్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్ నంబియార్ తన పదవికి రాజీనామా చేశారు. నాస్కాం ప్రెసిడెంట్‌గా నియమితులు కావడంతో ఆయన కాగ్నిజెంట్‌కు రాజీనామా చేశారు. దీంతో కాగ్నిజెంట్ గ్లోబల్ హెడ్‌గా పదొన్నతి పొందిన రాజేశ్ వారియర్‌కు అదనంగా ఇండియా సీఎండీగా బాధ్యతలు అప్పగించింది. వచ్చే నెల 2న గ్లోబల్ హెడ్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించబోతున్న రాజేశ్..అక్టోబర్ 1 నుంచి సీఎండీగా వ్యవహరించనున్నారు. కాగ్నిజెంట్‌లో చేరకముందు రాజేశ్..ఈవీపీ, ఇన్ఫోసిస్‌లో విధులు నిర్వహించారు. అలాగే మైక్రోసాఫ్ట్ బిజినెస్ డిజిటల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు.

## జొమాటో చేతికి పేటీఎం ఎంటర్‌టైన్‌మెంట్

న్యూఢిల్లీ, ఆగస్టు 21: పేటీఎం..తనకున్న ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ వ్యాపారాన్ని జొమాటోకు విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. ఒప్పందం విలువ రూ.2,048 కోట్లు. ఎంటర్‌టైన్‌మెంట్‌లో భాగంగా పేటీఎం యాప్ కింద సినిమా టికెట్‌లతోపాటు స్పోర్ట్స్, ఈవెంట్లకు సంబంధించిన అన్ని రకాల టికెట్లను విక్రయిస్తున్నది. ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ వ్యాపారాన్ని జొమాటో లిమిటెడ్‌కు విక్రయిస్తున్నట్లు వన్ 97 కమ్యూనికేషన్స్ బుధవారం ప్రకటించింది.

## నియామకాలకు కార్పొరేట్లు నో

న్యూఢిల్లీ, ఆగస్టు 21: దేశీయ కార్పొరేట్లు ఉద్యోగుల నియమాకాలను భారీ స్థాయిలో తగ్గించుకున్నాయి. 2022-23లో 5.7 శాతం వృద్ధితో నియామకాలు చేపట్టిన కార్పొరేట్ సంస్థలు.. ఆ మరుసటి ఏడాది 1.5 శాతానికి తగ్గించుకున్నాయని బీవోబీ వెల్లడించింది. రిటైలింగ్, ట్రేడింగ్, మౌలిక, రియల్టీ, రంగాల్లో పెరిగినప్పటికీ..ఆతిథ్య, లాజిస్టిక్స్, బిజినెస్ సర్వీసెస్, టెక్స్‌టైల్ రంగాల్లో తగ్గుముఖం పట్టాయని పేర్కొంది.

## ఏఐ విమానాల్లో వైర్‌లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ సేవలు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఎయిర్ ఇండియా ప్రయాణికులకు వైర్‌లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ సేవలు ప్రారంభించింది. ప్రస్తుతం ఈ సేవలు పెద్ద విమానాల్లో మాత్రమే అందిస్తున్నట్లు, దశలవారీగా మిగతా విమానాల్లో కూడా ప్రారంభించబోతున్నది. విమాన ప్రయాణ సమయంలో వినోదం అందించాలనే ఉద్దేశంతో విస్తా పేరుతో ఈ నూతన సేవలకు శ్రీకారం చుట్టినట్లు, ప్రస్తుతం బీ777, ఏ350 ఎయిర్‌క్రాఫ్ట్‌ల్లో మాత్రమే అందిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రయాణికులు తమ డివైజుల్లో ఎంటర్‌టైన్‌మెంట్ కంటెంట్‌ను తిలకించవచ్చునని తెలిపింది.

చిత్రం



# ఇదే ట్రెండ్ కొనసాగాలి

'నా సినిమా వచ్చి మూడేళ్లయింది. ఇక నుంచి ఎక్కువ సినిమాలు చేస్తాను. 'పుష్ప-2' అద్భుతంగా రూపుదిద్దుకుంటున్నది. డిసెంబర్ 6న అస్సలు తగ్గేదేలే. ఇది మాత్రం ఫిక్స్' అన్నారు అల్లు అర్జున్. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన 'మారుతినగర్ సుబ్రమణ్యం' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రావు రమేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి లక్ష్మణ్ కార్య దర్శకుడు. అంకిత్, రమ్య పసుపులేటి జంటగా నటించారు. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలు. ఈ చిత్రానికి అగ్ర దర్శకుడు సుకుమార్ సతీమణి తబితా సుకుమార్ సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నది. ఈ నెల 23న విడుదల కానున్నది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ 'నాకు సుకుమార్‌గారు అంటే చాలా ఇష్టం. ఎంతిష్టమో మాటల్లో చెప్పలేను. తబితాగారు చాలా కంఫర్టబుల్ పొజిషన్‌లో ఉండి ఈ సినిమాను ప్రొడ్యూస్ చేయడానికి ముందుకు రావడం అభినందనీయం. రావు రమేష్ గారు నా మనసుకు నచ్చిన ఆర్టిస్టు. బద్రినాథ్ సినిమా టైంలోనే 'మీరు ఇండస్ట్రీని ఏలుతారు సర్' అని చెప్పా. ఈ మధ్య చిన్న సినిమాలకు ఆడియెన్స్ మంచి ఆదరణ కనబరుస్తున్నారు. ఇదే ట్రెండ్ కొనసాగాలని కోరుకుంటున్నా' అన్నారు. ఈ సినిమా చూసి బాగా నవ్వుకున్నానని, సినిమాల్లో బాగా పర్‌ఫార్మ్ చేసే వాళ్లను తాను పెద్ద హీరోగా చూస్తానని, తన దృష్టిలో రావు రమేష్‌గారు పెద్ద హీరోనే అని సుకుమార్ చెప్పారు. చిత్ర సమర్పకురాలు తబిత మాట్లాడుతూ 'ఈ సినిమా చూసినప్పుడు చక్కటి వినోదం, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో గొప్పగా అనిపించింది. ఇలాంటి మంచి సినిమా ప్రేక్షకులందరికి రీచ్ కావాలనే ఉద్దేశ్యంతో సమర్పకురాలిగా ఉండటానికి ముందుకొచ్చా' అని చెప్పింది.

# కంటెంట్‌ను బట్టే విజయం



'ప్రస్తుతం మంచి కంటెంట్ ఉంటే చిన్న సినిమాలు కూడా పెద్ద విజయాలను సాధిస్తున్నాయి. సినిమా చిన్నా పెద్దా అనే విషయం కంటే కంటెంటే ప్రధానం. తమిళంలో విజయవంతమైన ఈ చిత్రం తెలుగులో కూడా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు రామ్‌గోపాల్‌వర్మ. హారర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ-2' ఈ నెల 23న తెలుగులో విడుదలకానుంది. అరుల్‌నిధి, ప్రియా భవానీ శంకర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకుడు. బి.సురేష్ రెడ్డి, మానస రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. హారర్ కంటే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఎక్కువగా ఆకట్టుకుంటాయని, తమిళంలో మాదిరిగానే తెలుగులో కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత బి.సురేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సినిమాకు మరో రెండు భాగాలను తెరకెక్కించబోతున్నామని దర్శకుడు ఆర్.జ్ఞానముత్తు తెలిపారు.

## చనిపోయిన వారు తిరిగొస్తే?



రిషి, ప్రియాంక కుమార్ జంటగా తెలుగు, కన్నడ భాషల్లో రూపొందిన చిత్రం 'రుద్ర గరుడ పురాణం'. కేఎస్ సందీప్ దర్శకుడు. అశ్విన్ విజయ్, లోహిత్ నిర్మాతలు. నాలుగు దక్షిణాది భాషల్లో విడుదల కానుంది. బుధవారం నిర్మాత, దర్శకుడు మధుర శ్రీధర్ టీజర్‌ను లాంచ్ చేశారు. హీరో రిషి మాట్లాడుతూ 'గరుడ పురాణంలోని అంశాలు ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. 25 ఏళ్ల క్రితం ఓ బస్సు ప్రమాదంలో చనిపోయిన వారంతా తిరిగి వస్తే ఏం జరిగిందన్నదే చిత్ర కథ. సీట్‌ఎడ్జ్ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుంది' అన్నారు. హీరో రిషి అద్భుతమైన నటుడని, ఆయన నటించిన కన్నడ సినిమాలు కొన్ని చూశానని మధుర శ్రీధర్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కృష్ణప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: కేఎస్ సందీప్.

## లయన్ కింగ్‌కు వాయిస్ ఓవర్



వాల్ట్ డిస్నీ రూపొందించిన 'ది లయన్ కింగ్' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఈ ఫ్రాంచైజీలో కొత్త సినిమాగా 'ముఫాసా: ది లయన్ కింగ్' డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. పలు భారతీయ భాషల్లో కూడా ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సినిమా తెలుగు వెర్షన్ ముఫాసా పాత్రకు అగ్ర హీరో మహేష్‌బాబు వాయిస్ ఓవర్ అందిస్తున్నారు. తెలుగు ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేయబోతున్నారు. ముఫాసా పాత్రకు డబ్బింగ్ చెప్పడం పట్ల మహేష్‌బాబు ఆనందం వ్యక్తం చేశారు. తన కుటుంబంతో కలిసి ఆనందంగా సెలబ్రేట్ చేసుకునే మూమెంట్ ఇదని అన్నారు. ఆయన మాట్లాడుతూ 'డిస్నీ సంస్థ చిత్రాల్లోని ఎంటర్‌టైన్‌మెంట్, స్టోరీటెల్లింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అడవికి రారాజైన ముఫాసా పాత్రకు వాయిస్ అందించడం ఆనందంగా ఉంది. ఈ సినిమా తెలుగు వెర్షన్‌ను అందరూ ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నా' అన్నారు. తెలుగు వెర్షన్‌కు మహేష్‌బాబు వాయిస్ ఓవర్ జీవం పోసిందని డిస్నీస్టార్ స్టూడియోస్ హెడ్ బిక్రమ్ దుగ్గల్ అన్నారు. ఈ చిత్రానికి బారీజెంకిన్స్ దర్శకత్వం వహించారు.

## 'ఓజీ' ట్రైలర్ ఆరోజే..!



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా పాలనాపరమైన విధులతో బిజీగా ఉండటంతో పవన్‌కల్యాణ్ తాజా చిత్రాలు ఓజీ, ఉస్తాద్ భగత్‌సింగ్, హరిహరవీరమల్లు షూటింగ్స్ అన్నీ వాయిదా పడ్డాయి. తాజాగా ఈ చిత్రాలను వరుసగా పూర్తి చేసేందుకు పవన్‌కల్యాణ్ సమాయత్తమవుతున్నారు. త్వరలో ఆయన 'హరిహర వీరమల్లు' షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నారు. ఈ నేపథ్యంలో 'ఓజీ' సినిమా అప్‌డేట్ గురించి అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను పవన్‌కల్యాణ్ జన్మదినమైన సెప్టెంబర్ 2న విడుదల చేయబోతున్నట్లు చిత్ర నిర్మాత డీవీవీ దానయ్య అధికారికంగా ప్రకటించారు. దీంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుడా పోయాయి. త్వరలో 'ఓజీ' షూటింగ్ కూడా మొదలుకానున్నట్లు తెలిసింది. ఇప్పటికే 60శాతం చిత్రీకరణ పూర్తయింది. వచ్చే నెలలో షూటింగ్‌ను పునఃప్రారంభిస్తారని, నాయకానాయికలు పవన్‌కల్యాణ్, ప్రియాంక మోహన్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరించబోతున్నారని సమాచారం. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా 'ఓజీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, అర్జున్‌దాస్, శ్రియా రెడ్డి, ప్రకాష్‌రాజ్ తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు.

## ప్రత్యేక గీతంతో కొత్త రికార్డు



అగ్ర కథానాయికలు సైతం ఐటెమ్ సాంగ్స్‌లో నర్తించడం ఇప్పుడు మామూలైపోయింది. వారి పాటలతో సినిమాకు కావాల్సినంత ప్రచారం వస్తుండటం, సదరు గీతాలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుండటంతో టాప్ హీరోయిన్స్ ఐటెంసాంగ్స్‌లో నటించడానికి ఏమాత్రం సంకోచించడం లేదు. తాజాగా హిందీ చిత్రం 'స్త్రీ-2'లో 'ఆజ్ కి రాత్' అంటూ అగ్ర నాయిక తమన్నా చేసిన ఐటెంసాంగ్ సోషల్‌మీడియాలో రికార్డులు సృష్టిస్తున్నది. ఈ స్పెషల్ సాంగ్ సినిమాకు చాలా ప్లస్ అయిందని అంటున్నారు. ఈ పాటకు సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ఇప్పటికే పదకొండుకోట్ల వ్యూస్ లభించాయి. ఇటీవలకాలంలో ఓ ఐటెంసాంగ్‌కు లభించిన అత్యధిక వీక్షణలు ఇవేనని చెబుతున్నారు. ఐదు నిమిషాల నిడివిగల ఈ పాటకు తమన్నా రెండుకోట్లు పారితోషికం తీసుకుందని, ఇది కూడా ఓ రికార్డని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఈ పాటలో తమన్నా వేసిన స్టెప్పులు చాలా పాపులర్ అయ్యాయి. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధాకపూర్ జంటగా నటించిన 'స్త్రీ-2' ఈ నెల 15న విడుదలై భారీ వసూళ్లతో దూసుకుపోతున్నది.

## కోపం వచ్చిదంటే బ్లాక్‌బస్టరే!



'మన మధ్యలో ఏదో తెలియని బంధం ఉంది. దానిని మరింత పటిష్టం చేసే సినిమా 'సరిపోదా శనివారం'. రిలీజ్ రోజున థియేటర్లన్నీ మార్మోగిపోతాయి' అన్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం' ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అగ్ర నిర్మాత దిల్‌రాజు విడుదల చేస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాని మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం మీ అందరిలాగే ఆతృతగా ఎదురుచూస్తున్నా. తనవాళ్ల శ్రేయస్సు కోసం కోపాన్ని పాజిటివ్ వేలో ఉపయోగించే ఓ వ్యక్తి కథ ఇది. ఇప్పుడు నాకు కోపం వచ్చింది. నాకు కోపం వచ్చిందంటే బ్లాక్‌బస్టర్ హిట్ పక్కా (నవ్వుతూ)' అన్నారు. నాని గత చిత్రం 'దసరా'ను ఈ సినిమా బీట్ చేస్తుందనే నమ్మకం ఉందని, దర్శకుడు వివేక్ అద్భుతంగా తెరకెక్కించాడని దిల్‌రాజు తెలిపారు. గొప్ప కథను దర్శకుడు వివేక్ అంతే గొప్పగా తెరకెక్కించాడని, నాని నటన హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాత డీవీవీ దానయ్య చెప్పారు. ఈ సినిమాలో తాను చారులత అనే బ్యూటీపుల్ క్యారెక్టర్‌లో కనిపిస్తానని కథానాయిక ప్రియాంక మోహన్ పేర్కొంది.

## పొట్టి దుస్తులు వేసుకోవద్దు



సినీరంగంలో నేటితరం మహిళల వస్త్రధారణ అభ్యంతరకరంగా ఉంటున్నదని, పొట్టి దుస్తులను ధరిస్తూ శరీర భాగాలను ప్రదర్శించే ధోరణి ఎక్కువైపోయిందని సీనియర్ నటి, జాతీయ అవార్డు గ్రహీత శారద ఆవేదన వ్యక్తం చేసింది. మలయాళ సినీరంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, లైంగికపరమైన వేధింపులపై అధ్యయనం చేయడానికి కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిషన్‌లో శారద సభ్యురాలిగా ఉన్నారు. ఇటీవలే ఈ కమిషన్ తన రిపోర్టును ప్రభుత్వానికి అందజేసింది. మలయాళ ఇండస్ట్రీలో కాస్టింగ్‌కౌచ్ తీవ్రంగా ఉందని, మహిళలు లైంగికపరంగా వేధింపులకు గురవుతున్నారని కమిషన్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో సినీరంగంలో మహిళల ప్రాతినిధ్యం గురించి కమిషన్‌కు శారద తన అభిప్రాయాలను వెల్లడించింది. సినీరంగంలో ఒకప్పుడు ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేదని, సెట్స్‌లో డబుల్ మీనింగ్ డైలాగ్‌లు ఎవరూ మాట్లాడేవారు కాదని, ఎలాంటి వేధింపులు ఉండేవి కావని శారద పేర్కొంది. పాశ్చాత్య సంస్కృతి వల్లే పెడధోరణులు ప్రబలుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. సినిమాకు సంబంధించిన సాంకేతిక విద్యకు మహిళలు దూరంగా ఉండటమే మంచిదని, ప్రభుత్వాలు కూడా ఈ తరహా స్టడీస్ నుంచి మహిళలను మినహాయించాలని శారద సలహా ఇచ్చింది. 'సినిమా టెక్నికల్ స్టడీస్ మహిళలకు సరిపడవు. చదువు మధ్యలో ఆపేసి వారు టెక్నికల్ అంశాల్లో శిక్షణ తీసుకుంటారు. అయితే సినీ రంగంలో జాబ్ గ్యారెంటీ ఏమీ ఉండదు. దాంతో వారి కెరీర్ ఇబ్బందుల్లో పడుతుంది' అని శారద వ్యాఖ్యానించింది.